

కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ విజయరామరాజు, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ తదితరులు

## కడప విమానాశ్రయంలో టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన


- వర్చువల్ విధానం ద్వారా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ప్రధాని
- హాజరైన పలువురు జిల్లా నేతలు

కడప (మారుతీనగర్), మార్చి 10: భారతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 14 విమానాశ్రయాలలో నూతన టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులకు ఉత్తర్‌ప్రదేశ్ అజాంఘర్ నుంచి వర్చువల్ విధానం ద్వారా దేశ ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా కడప విమానాశ్రయంలో రూ.226 కోట్లతో నూతన టెర్మినల్ భవన నిర్మాణ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమానికి కలెక్టర్ విజయరామరాజుతో పాటు ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, జేసీ గణేష్‌కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పౌర భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయస్థాయికి దీటుగా అభివృద్ధి చేసేందుకు వికసిత్ భారత్ సంకల్పంతో భారీ పరివర్తనకు నాంది పలికారన్నారు. అందులో భాగంగానే భవిష్యత్తులో ప్రయాణీకుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని నూతన టెర్మినల్ భవనం నిర్మించటానికి భారతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ తగు చర్యలు చేపట్టిందన్నారు. రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ నాయుడు మాట్లాడుతూ ఆధునిక, సురక్షిత, విమానాశ్రయాల కార్యకలాపాల నిర్వాహణ, సమర్థవంతమైన విమానయాన సేవలను దేశం అంత టా మెరుగుపరచాలన్న ప్రధాన ఉద్దేశ్యంతో ప్రధాని ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష మాట్లాడుతూ నూతన టెర్మినల్ బిల్డింగ్ ఏర్పాటుతో విమానయాన సేవలు మరింత విస్తృతం కావడంతో పాటు జిల్లాలో అన్ని రకాల రవాణా వ్యవస్థలు మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ఉడాన్ పథకం ద్వారా నిరంతరాయంగా విమానయాన సర్వీసులను కొనసాగించాలని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఉన్నతాధికారులను కోరామన్నారు. కడప ఆర్డీఓ మధుసూదన్, కడప ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ సుజిత్‌కుమార్‌పోదార్, టెర్మినల్ మేనేజర్ జోసఫ్, స్థానిక బీజేపీ నాయకులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# జగనన్నా.. ఇదేందన్నా..!








సీఎం జగన్ ప్రతిపక్ష నేత హోదాలో జిల్లా అభివృద్ధిని త్రీడీ సినిమాలో చూపించారు. దేవుని దయ వల్ల మన ప్రభుత్వం వస్తే జిల్లా రూపురేఖలు మారుస్తానంటూ చెప్పుకొచ్చారు.. ముఖ్యంగా స్టీలు ఫ్యాక్టరీ, పెండింగు ప్రాజక్టు పనులు, గండికోట ముంపువాసుల పరిహారం. ఇలా ఎన్నెన్నో ప్రతిపక్ష నేత హోదాలోనే కాదు.. సీఎం హోదాలో కూడా చెప్పుకొచ్చారు. మరి సీఎం పదవి చేపట్టి ఐదేళ్లు కావస్తోంది.. మరో కొద్దిరోజుల్లోనే ఎన్నికలు జరగనున్నాయి. మరి నువ్వు ఇచ్చిన హామీలు ఏమయ్యాయన్నా.. మాట తప్పను మడమ తిప్పను.. ఇచ్చిన మాట కోసం కట్టుబడి ఉంటాను.. అంటూ డైలాగులు చెప్తివి... ఇప్పుడు మన జిల్లాకు ఇచ్చిన హామీ ఏమైందంటూ సొంత జిల్లావాసులు ప్రశ్నిస్తున్నారు. దివంగత వైఎస్ఆర్ హయాంలో సొంత జిల్లా అభివృద్ధి కోసం తన మార్కు చూపించారు. జిల్లావాసులు కూడా జగన్ మా వాడని చెప్పి ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే వారి ఆశలు నెరవేర్చడం మాత్రంలో ఫెయిల్ అయ్యారని అంటారు.

- షుగరు ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తా అంటివి.. క్లోజ్ చేస్తివి
- మూడేళ్లలో స్టీలు ఫ్యాక్టరీ అంటివి.. ఆ ఊసే లేదు
- గండికోట ముంపువాసులకు పరిహారం ఏదీ
- జీఎన్ఎస్ఎస్ ప్రాజెక్టుల్లో కదలిక ఏదన్నా..
- చెప్పిన హామీలు మరిచిన జగనన్న
- ప్రశ్నిస్తున్న జిల్లా వాసులు





చంటిబిడ్డతో విధులకు హాజరైన వలంటీర్

(కడప-ఆంధ్రజ్యోతి): స్టీలు ఫ్యాక్టరీ వస్తే కడప జిల్లా రూపురేఖలే మారిపోతాయి. అలాంటి పరిశ్రమ స్థాపనకు సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే టెంకాయ కొట్టారు. మూడేళ్లలో పూర్తి చేస్తామని ఆర్భాటంగా హామీ ఇచ్చారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు టెంకాయ కొడితే అది మోసం, ఎన్నికల తరువాత ఆరునెలలకు టెంకాయ కొడితే విశ్వసనీయత అన్నారు. జగన్ చెప్పిన గడువు ప్రకారం స్టీలు ఫ్యాక్టరీ వచ్చింటే ప్రత్యక్షంగా పరోక్షంగా 25వేల మందికి ఉపాధి వచ్చేది. జగన్ పాలనలో రెండుసార్లు శంకుస్థాపన చేయడం, భాగస్వామ్యం మారడం తప్ప ఎలాంటి ఉలుకు పలుకు లేదు.

గండికోట ముంపువాసులకు కూడా పదిలక్షలు పరిహారం ఇస్తామని అందరికీ ఇవ్వలేదు. ఇక అధికారంలోకి వస్తే చెన్నూరు షుగరు ఫ్యాక్టరీని తెరిపిస్తామంటివి. ఇప్పుడు అది కోర్టు పరిధిలోకి వెళ్లింది. కడపలో చేపట్టిన రహదారుల విస్తరణలో నత్తేనయంగా సాగుతన్నాయి. జగన్ వచ్చినప్పుడు అంబేద్కర్ సర్కిల్ స్టాచ్యు , వైజంక్షన్ రోడ్డు, కోటిరెడ్డిసర్కిల్, సెవెన్‌రోడ్స్ పూర్తి చేశారు. మిగతా రోడ్లన్నీ నత్తే నయంగా సాగుతున్నాయి. దీంతో జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక రూ.340 కోట్లతో చేపట్టిన వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ భవన పనులకు ఎదుగుబొదుగూ లేదు. కొప్పర్తి పారిశ్రామికవాడ పరిస్థితి అదే రీతిలో ఉంది. ఇక జీఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు అలాగే ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే జగన్ ఇచ్చిన హామీలు చాంతాడుంతే ఉంటే.. పనులు పూర్తి మాత్రం నామమాత్రంగానే ఉన్నాయి.

## భద్రత బలగాల వలయంలో పులివెందుల

- భారీగా చేరుకున్న పోలీసు బలగాలు
- కాన్వాయ్ రిహార్సల్స్ కోసం బారికేడ్లు ఏర్పాట్లు
- స్థానిక ప్రజలు, ప్రయాణికుల అవస్థలు



బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పులివెందుల రూరల్, మార్చి 10: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పులివెందుల భద్రత బలగాల వలయంలో ఉంది. సోమవారం పులివెందులలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించునన్నారు. ఈ నేపథ్యంలో వేల సంఖ్యలో పోలీసు బలగాలు పులివెందులకు చేరుకున్నాయి. బాకరాపురం హెలిప్యాడ్ నుంచి కడప రోడ్డులోని వైఎస్సార్ జీజీహెచ్ వరకు, అక్కడి నుంచి నల్లపురెడ్డిపల్లె సమీపంలోని బనానా ప్యాక్ హౌస్, మినీ సెక్రటేరియట్, వైఎస్సార్ జంక్షన్, బోలేవార్డు, వైఎస్ జయమ్మ మున్సిపల్ కాంప్లెక్స్, గాంధీ జంక్షన్, ఉలిమెల్ల లేక్, ఆదిత్య బిర్లా యూనిట్‌లను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. దీంతో పోలీసులతో పాటు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సీఎం కాన్వాయ్ వెళ్లే దారుల్లో అడుగడుగునా పహారా కాస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి పలు వీధుల నుంచి మెయిన్‌రోడ్డులోకి వచ్చే దారులను మూసివేశారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాన్వాయ్ రిహాల్స్ కోసం ఇంతసేపు వేచి ఉండాలా అంటూ మండిపడ్డారు. కాగా మెయిన్ రోడ్డు మూసివేయడంతో పలు రూట్లలో గంటల కొద్దీ ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిపివేశారు. దీంతో పట్టణంలోని బస్టాప్‌ల వద్ద వేచి ఉన్న ప్రయాణికులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ప్రొద్దుటూరు, తాడిపత్రి, ధర్మవరం, తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు ముఖ్యంగా కడప, కదిరికి వెళ్లే ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. మొత్తం మీద సీఎం రాకముందే ప్రజలు, ప్రయాణికులు నరకం చూసినట్లయింది.

## కుందూలో మునిగి అక్కాతమ్ముడు మృతి

రాజుపాలెం, మార్చి 10: కుందూ నదిలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు జారి పడి హిమాంబీ(27) ఫక్కీర్ మస్తాన్(25) అనే అక్కాతమ్ముడు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... నంద్యాల జిల్లా చాగలమర్రి టౌన్‌కు చెందిన హిమాంబీ, ఫక్కీర్ మస్తాన్‌తో పాటు హిమాంబీ భర్త ఖాజా హుస్సేన్‌లు నంద్యాల జిల్లా ఎర్రగుంట్ల దర్గా వద్ద పూజలు చేసేందుకు వెళ్లారు. పూజల అనంతరం తిరిగి చాగలమర్రికి చేరుకున్నారు. అయితే ఇంటికి చేరుకునే ముందు రాజుపాలెం మండలం కూలూరు గ్రామ సమీపంలో ఉన్న కుందూనదిలో స్నానం చేసేందుకు నదిలోకి దిగారు. అయితే అక్కడ గుంతలు పెద్దగా ఉండడంతో హిమాంబీ, ఫక్కీర్ మస్తాన్ నదిలో మునిగిపోయారు. దీంతో హిమాం బీ భర్త ఖాజా హుస్సేన్ పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న రజకులు అక్కడకు చేరుకున్నారు. అయితే అప్పటికే ఇద్దరు మృతి చెందారు. ఈ సమాచారం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని విచారించారు. ఖాజా హుస్సేన్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సిద్దయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హిమాంబీకి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఫక్కీర్‌మస్తాన్‌కు నాలుగు నెలల కుమార్తె ఉంది.



కుందూలో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందిన అక్క, తమ్ముడు

## నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించండి : ఎస్పీ

పులివెందుల టౌన్, మార్చి 10: నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఆదివారం పులివెందులలోని ఎస్‌సీఆర్‌సీ కళ్యాణ మండపంలో పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. కడప ఎయిర్‌పోర్టు, పులివెందుల హెలిప్యాడ్, పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పులివెందులలో కాన్వాయ్ రిహార్సల్స్ నిర్వహణ, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, కర్నూ లు అదనపు ఎస్పీ (అడ్మిన్) నాగరాజు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

## టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక చారిత్రాత్మకం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 10: టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక చారిత్రాత్మకమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైసీపీ నిరంకుశ పాలన తుదముట్టించేందుకు కలిసి పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆదివారం కడప నగరం టీడీపీ నియోజకవర్గం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీ సభ్యులుగా అందరూ స్వాగతిస్తున్నమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల వల్ల అధినేత చంద్రబాబు పొత్తు నిర్ణయం తీసుకున్నారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చివేశారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో కులంతో సంబంధం లేకండా బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగిపోయాయని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రభుత్వమంటే కేవలం జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామక్రిష్ణారెడ్డి, ధనుంజయరెడ్డిగా మారిందన్నారు. ఈ ప్రభుత్వంలో బీసీలను ఎంత హీనంగా చూశారో వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గంగా క్రిష్ణమూర్తి మాటల్లోనే స్పష్టమైందని తెలిపారు. బీసీలకు టీడీపీ పుట్టినిల్లులాంటిదని జయహో బీసీ కార్యక్రమం ద్వారా మరోసారి రుజువైందన్నారు. ఇంత అరాచక జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు మూడు పార్టీలు కలిసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని స్పష్టం చేశారు.






# నిబంధనలకు పాతర

- మరమ్మతుల పేరిట భారీ మొత్తంలో చెల్లింపులు
- కౌన్సిల్ ఆమోదం, ఎస్టిమేట్లు లేకుండానే పనులు
- నిబంధనలు పక్కన పెట్టి రూ.27.52లక్షల చెల్లింపులు





2020-21లో చేసిన 12 పనులకు జరిపిన చెల్లింపులు

2021-22లో 47 పనులకు జరిపిన చెల్లింపులు

2021-22లో శానిటేషన్ విభాగం ఎనిమిది సార్లు జరిపిన చెల్లింపులు

పులివెందుల రూరల్, మార్చి 10: ప్రజా అవసరాల నిమిత్తం ఏదైన పనిని ప్రారంభించాలంటే అంచనాలు తయారు చేయాలి... సంబంధిత అధికారులు మంజూరు చేయాలి.. కౌన్సిల్ ఆమోదం పొందిన అనంతరం పనులు కార్యరూపం దాల్చుతాయి. మున్సిపల్ పరిధిలో ఏదైనా పని చేయాలంటే నిబంధనల మేరకు మున్సిపల్ నిధుల నుంచి కమిషనర్ రూ.20వేల వరకు ఒకే బిల్లులు డ్రా చేసే అవకాశం ఉంటుంది. అయితే మున్సిపల్ పరిధిలో అంతకుమించి కమిషనర్ డ్రా చేశారు. ఎలాగంటే డ్రాయింగ్ పవర్ పరిమితితో అధిక బిల్లులు చెల్లించేలా అంచనాను తయారు చేసి ఎమ్‌బుక్‌లో నమోదు చేయడానికి బదులుగా పనులను అనేక భాగాలుగా చేసి బిల్లులు విభజించి పనులు చేశారు. కౌన్సిల్‌లో ప్రవేశపెడితే అంక్షలు అడ్డు వస్తాయనే ఉద్దేశంతో కౌన్సిల్ ఆమోదం పొందకుండానే పనులు చేసి బిల్లులు చెల్లించినట్లు తెలుస్తోంది. నిబంధనలు అతిక్రమించి 001 అకౌంట్ ద్వారా మున్సిపల్ నిధులు చెల్లించారు. మున్సిపాలిటీకి ప్రయోజనం చేకూరేందుకు ఇష్టంలేని అధికారులు టెండర్లు, సీల్డ్ కొటేషన్లు పిలువలేదని తెలుస్తోంది. నిబంధనలు పాటించని అధికారుల తీరు చూస్తే అన్ని చోట్ల పనులు చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్లు పిలవకుండా ఏ పని చేయకూడదని మున్సిపల్ శాఖలోని కొందరు అధికారులు స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతి పరిశీలన, వెలికితీసిన నిజాలు చూస్తే అధికారుల తెలివితేటలు ఎలా ఉన్నాయో తేటతెల్లం అవుతుంది.

### మరమ్మతుల పేరిట చెల్లింపులు


2020-21 సంవత్సరానికి పులివెందుల మున్సిపల్ పరిధిలో తాగునీటి మోటర్ల మరమ్మత్తుల, పైప్‌లైన్ లీకేజీలకు రూ.5,18,405 బిల్లులు చెల్లింపులు జరిపారు. మున్సిపల్ పరిధిలో కూరగాయల మార్కెట్, సుంకులమ్మ ఆలయం, వెంకటాపురం, పెద్ద రంగాపురం, రాజారెడ్డి కాలనీ, బాకరాపురం, యర్రగుడిపల్లె, నగరిగుట్ట, కొండారెడ్డి కాలనీ, బయమ్మతోట, సుజాత హాల్, రాణితోపు, గుంతబజార్, కనంపల్లె, చెన్నారెడ్డి కాలనీ, శిల్పారామం, వెటర్నరీ ఆసుపత్రి, జండామాను వీధి, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, రోటరీపురంలోని యూజీడీ పంప్‌హౌస్, ఎస్‌బీఐ కాలనీ తదితర ప్రాంతాలలో మోటర్ల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీ పనులు చేశారు. ఈ పనులు సీల్డ్ కొటేషన్లు, కాంపిటెంట్ అథారిటీ ఆమోదం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే ఈ పనులన్నీ పులివెందులలోని రాఘవేంద్ర స్వామి రివైండింగ్ వర్క్స్ పేరుపై 18.03.2021 మరియు 23.03.2021 తేదీలలో బిల్లులు చెల్లించారు. 12 పనులకు రూ. 5,18,405 బిల్లులు చెల్లించారు. ఈ పనులు, చెల్లింపులు స్వప్రయోజనాల కోసం జరిపినట్లు స్పష్టమవుతోంది. అదే విధంగా మున్సిపల్ పరిధిలో 2021-22లో తాగునీటి మోటర్ల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీలకు రూ.19,36,273 బిల్లులు చెల్లింపులు జరిపారు. మొత్తం 47 పనులు చేశారు. ఈ పనులు కూడా 21.05.2021 తేదీల్లో 24 పనులకు, 16.06.2021న రెండు పనులకు, 19.06.2021, 05.07.2021 ఒక్కొక్కటి, 15.07.2021న రెండు, 10.12.2021, 21.12.2021 తేదీలలో ఒక్కొక్కటి, 26.03.2022వ తేదీ 15 పనులకు బిల్లుల చెల్లింపులు జరిపారు. ఈ పనులలో 24 పనులకు గాను 15 పనులకు రాఘవేంద్ర స్వామి రివైండింగ్ వర్క్స్ పేరుపై బిల్లుల చెల్లింపులు జరిగాయి. పనులు చేశారా లేదా అనే విషయం పక్కనపెడితే, బిల్లుల చెల్లింపులో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది.

### శానిటేషన్ కొనుగోల్‌లో జిమ్మిక్కులు

2021-22 సంవత్సరంలో హైపోక్లోరైడ్ కెమికల్ మరియు బ్లీచింగ్ పౌడర్ కొనుగోళ్లలో కూడా మున్సిపల్ అధికారులు జిమ్మిక్కులు ప్రదర్శించినట్లు స్పష్టమవుతోంది. ఇందులో కూడా కమిషనర్ డ్రాయింగ్ పవర్ పరిమితిలో ఒక బిల్లును క్లెయిమ్ చేయకుండా అనేక బిల్లులను తయారు చేసి వస్తువులను సేకరించి ఒకే సంస్థకు చెల్లింపులు జరిపారు. ప్రొద్దుటూరుకు చెందిన పృథ్వీ ఏజెన్సీస్‌కు రూ.2,97,924 చెల్లించారు. 01.12.2021 తేదీ ఎనిమిది సార్లు బిల్లులు చెల్లించినట్లు స్పష్టమయింది. ఆ సంస్థ ఇచ్చిన బిల్లులు వాటి చెల్లింపులు ఒకసారి చూస్తే...బిల్ నెంబర్ 90, 28.07.2020న, బిల్ నెంబర్ 344, 11.07.2020న తీసుకొని 01.12.2021న చెల్లింపులు జరిపారు. ముందు ఇచ్చిన బిల్ నెంబర్ గల తేదీకి, తర్వాత ఎప్పుడో వచ్చే బిల్లుకు గల తేదీ తీసుకొని చెల్లింపులు జరిపారు. బిల్ నెంబర్ తక్కువగా ఉండి తేదీ నెలాఖరుది కావడం, మరొక బిల్ నెంబర్ ఎకక్కువగా ఉండి తేదీ నెల మధ్యలోది కావడం. అది కూడా ఒకే నెలలో తేదీలు కావడం విశేషం. దీనిని బట్టి చూస్తే కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది.

### అవన్నీ ఇంజనీరింగ్ సెక్షన్ చూసుకుంటుంది..

మోటర్లు మరమ్మతులు, పైప్‌లైన్ లేకేజీల పనులు చేసేందుకు ఎలా ముందుకెళ్తారని మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. అవన్నీ ఇంజనీరింగ్ సెక్షన్ చూసుకుంటుందని, నిబంధనల ప్రకారం ముందుకెళ్లడం జరుగుతుందని సమాధానమిచ్చారు.

ద్వితీయ వర్ధంతి

కార్యదీక్షాపరులు, స్నేహశీలి, మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి అందరి ఆదరాభిమానాలు చూరగొన్న మీరు చనిపోయి రెండు సంవత్సరములు అయినను మీ జ్ఞాపకాలు మరువలేకున్నాము. మీ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ...

UTTI SUDHAKAR BABU garu

Chennuru, YSR District

Birth : 16-08-1958

Death : 11-03-2022

కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు

## కారు ఢీకొని స్కూటరిస్ట్ మృతి

**మృతుడు టీటీడీ విజిలెన్స్ ఉద్యోగిగా గుర్తింపు**



మృతి చెందిన శేషసాయికుమార్, స్కూటరిస్టు ఢీకొన్న కారు

రైల్వేకోడూరు, మార్చి 10: మండలంలోని అనంతరాజుపేట వద్ద కారు ఢీకొని స్కూటరిస్టు ఆదివారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ప్రధాన దారిలో తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారు కడప వైపు నుంచి తిరుపతి వైపు వెళుతున్న స్కూటరిస్టును ఢీకొంది. దీంతో అక్కడికక్కడే ఆర్.శేషసాయికుమార్ (30) మృతి చెందాడు. మృతుడు టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ టి.బాబు తన సిబ్బందితో వెంటనే సంఘటనాస్థలానికి వెళ్లారు. కాగా మృతుడి కుమారుడు, కుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారని, మృతుడి భార్య ఇటీవల చనిపోయిందని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు వెళ్లిన మృతుడు శనివారం హైదరాబాద్ నుంచి తన మోటారు సైకిల్‌లో కర్నూలుకు వచ్చి అక్కడ ఉన్న తన చెల్లెలు ఇంటిలో ఉండి, ఆదివారం తెల్లవారుజామున మోటారు సైకిల్‌లో తిరుపతికి బయలుదేరాడు. అనంతరాజుపేట వద్ద కారు ఢీకొనడంతో చనిపోయాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రామాపురంలో వృద్ధుడు...



మృతి చెందిన నారాయణ

రామాపురం, మార్చి 10: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీలో గల బ్రిక్స్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం కారు, స్కూటర్‌ను ఢీకొనడంతో స్కూటరిస్టు గునిశెట్టి నారాయణ (68) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... రాయచోటి పట్టణం మాసాపేట గ్రామం రెడ్డివారిపల్లెకు చెందిన బేల్దారి గునిశెట్టి నారాయణ మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం కొత్తపల్లెలో తన సమీప బంధువులు గంగమ్మ జాతరకు బోనాలు పెడుతుండడంతో వారి ఆహ్వానం మేరకు టీవీఎస్ స్కూటర్‌లో రామాపురానికి వచ్చి తిరిగి నల్లగుట్టపల్లె కొత్తపల్లెకు వెళుతుండగా రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని పోలీసులు 108 వాహనంలో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్‌వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

## టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

జమ్మలమడుగు, మార్చి 10: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో దిగువపట్నం కాలనీలో నివాసం ఉంటున్న టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బీరు నెల్సన్‌కుమార్ (55) మృతిచెందాడు. ఆయన మృతిచెందిన సమాచారం తెలుసుకున్న వెంటనే మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి మృతదేహాన్ని సందర్శించారు. మృతుడు కిడ్నీ సమస్యతో ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఉన్నట్లుండి ఆదివారం ఉదయం టీవీలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డికి టీడీపీ టిక్కెట్ రాదని, చూసి బాధపడుతూ ఒక్కసారిగా ఇంట్లో కుప్పకూలి పడిపోయినట్లు మృతురాలి భార్య ఓబుళమ్మ తెలిపారు.

## విద్యుత్ వైరు చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

కొండాపురం,మార్చి 10: మండలంలోని ముంపునకు గురైన పాత తాళ్లప్రొద్దుటూరు ప్రాంతంలో విద్యుత్ వైరు చోరీ కేసులో పోలీసులు రఘు అనే మరో వ్యక్తిని ఆదివారం అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు.అనిల్,మనోహర్‌తో పాటు రఘు అనే వ్యక్తి కలిసి విద్యుత్‌స్తంభాల వైరు చోరికి పాల్పడినట్లు ఎలక్ట్రికల్ ఏఈ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

## భర్త కనిపించలేదంటూ భార్య ఫిర్యాదు



వెంకటబాలమురళి

రామాపురం, మార్చి 10: మండలంలోని హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన గరికపాటి వెంకటబాలమురళి (30) ఈనెల 6న నుంచి కనిపించడం లేదని తన భార్య సలేంద్ర చిన్నరెడ్డెమ్మ ఆదివారం రాత్రి రామాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే... రామాపురం మండలం హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లె చెందిన గరికపాటి వెంకటబాలమురళితో రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులోని శివాలయం సమీపంలో నివాసం ఉంటున్న ఆకుల శంకరయ్య కుమార్తె చిన్నరెడ్డెమ్మతో మూడు సంవత్సరాల క్రితం వివాహమైందని, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని ఆమె ఫిర్యాదులో తెలిపారు. తన భర్త గ్రామంలోని ఆలయంలో పూజారిగా ఉంటూ తన స్వగ్రామం పప్పిరెడ్డిగారిపల్లెకు వెళ్తానని చెప్పి వెళ్లాడని, అప్పటి నుంచి ఇంతవరకు రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికామని, ఎక్కడా కనిపించకపోవడంతో రామాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## మూల్యాంకనంలో కోడింగ్ అత్యంత కీలకం

**అవగాహన కార్యక్రమంలో ఆర్జేడీ రాఘవరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 10: పదవ తరగతి పరీక్షల మూల్యాంకనంలో కోడింగ్ అత్యంత కీలకమని ఆర్జేడీ రాఘవరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల అజయ్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన పదవ తరగతిలో కోడింగ్ విధానంపై జరిగిన అవగాహన కార్యక్రమానికి రాయలసీమ ప్రాంతంలోని 8 జిల్లాల విద్యాశాఖాధికారులు, అసిస్టెంట్ కమిషనర్లు, చీఫ్ కోడింగ్ అధికారులు, అసిస్టెంట్ కోడింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడప ప్రాంతీయ సంచాలకులు రాఘవరెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి మూల్యాంకనంలో కోడింగ్ విధానంలో ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఒక్క విద్యార్థి కూడా నష్టపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రైనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని, అనుమానాలుంటే ఇక్కడే తీర్చుకోవాలని తెలియజేశారు. అనంతరం రీసోర్స్‌పర్సన్ సుంకర రామకృష్ణ కోడింగ్ ప్రక్రియలో మొదటిరోజు నుంచి చివరి రోజు వరకు ఎలా చేయాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో పూర్తిగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మధ్య మధ్యలో వారికి కలిగిన అనుమానాలను కూడా తీర్చారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి, కడప జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ, ఏడీ ప్రసాద్‌బాబు, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాసంగా బాడీబిల్డింగ్ పోటీలు




కడప (స్పోర్ట్స్), మార్చి 10: మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డర్ స్వర్గీయ షంషీరుద్దీన్ జ్ఞాపకార్థం కడప జిల్లా న్యూ ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ సారథ్యంలో ఆదివారం రాత్రి స్థానిక నేక్‌నామ్ కళాక్షేత్రంలో టైగర్ రాయలసీమ స్థాయి జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలకు రాయలసీమ జిల్లాల నుంచి సుమారు 150 మంది బాడీ బిల్డర్లు హాజరయ్యారు. వీరిలో వివిధ క్యాటగిరీల వారిగా నిర్వాహకులు పోటీలు చేపట్టారు. కార్యక్రమంలో స్టేట్ బాడీ బిల్డింగ్ జనరల్ సెక్రటరీ షేక్ న్యాయతుల్లా, పి.ఇంతియాజ్, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సెక్రటరీ తారీక్‌అలీ, వైస్ ప్రెసిడెంట్ అన్వర్ అలీ, సెక్రటరీ షేక్ ముక్తియార్, షేక్ రషీద్, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

# కట్ట పునర్నిర్మాణమెప్పుడో?

- రెండున్నరేళ్లయినా పట్టించుకోని పాలకులు
- అన్నమయ్య డ్యాం తెగినప్పుడు పెనగలూరు చెరువు సర్వనాశనం
- బీళ్లుగా మారిన 1100 ఎకరాల ఆయకట్టు
- ఉపాధి కోల్పోయిన వేలాది మంది రైతులు, కూలీలు



నీరు లేక నిరుపయోగంగా దర్శనమిస్తున్న పెనగలూరు చెరువు

పెనగలూరు, మార్చి 10: రెండున్నరేళ్ల కిందట అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయినప్పుడు పెనగలూరు చెరువుకు గండ్లు పడి చెరువు కట్ట కొట్టుకుపోయింది. అప్పటి నుంచి పాలకులు దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు రైతులు గానీ, ప్రతిపక్ష పార్టీ వారు గానీ ఈ రెండున్నరేళ్లలో అధికార పార్టీ పాలకులను ప్రశ్నించిన పాపాన పోలేదు. ప్రశ్నిస్తే కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తారేమోనని భయంతో ఎవరూ దీని గురించి మాట్లాడటం లేదని తెలిసింది. భారీ వరద నీటి వల్ల 2021 నవంబరు 19న అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో చెయ్యేటిలో ప్రళయంలా ప్రవహించిన వరద నీరు పెనగలూరు చెరువుపై పడింది. చెరువులో అప్పటికే సగం నీరుండటంతో ప్రళయంలా వచ్చిపడుతున్న అన్నమయ్య నీటితో గంటల వ్యవధిలోనే చెరువు నిండిపోయింది. దీంతో చెరువు కట్టకు నాలుగుచోట్ల పెద్దగండ్లు పడటంతో వరద నీరంతా ఆయకట్టు ద్వారా గుంజనేటిపై పడింది. పెనగలూరు చెరువు చరిత్రలో ఎన్నడూ జరగనంత ఘోరంగా నాలుగు చోట్ల భారీ గండ్లు పడ్డాయి. ఈ భారీ గండ్ల కారణంగానే చెరువులోని నీరంతా వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా ఈ సంఘటనతో చెరువు తరువాత ఉన్న కోడిచెన్నయ్యగారిపల్లె, పల్లంపాడు, నర్సింగరాజపురం, యారాచపల్లె గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజుల తరువాత ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చే ప్రయత్నాలు చేయగా నాలుగు చోట్ల పడ్డ గండ్ల కారణంగా ధ్వంసమైన కట్టపై వచ్చే వీలు కలగలేదు. ఆయా గ్రామ పెద్దలు యువత కలగజేసుకుని చెరువులోపలి భాగంలోనే కంపచెట్లను తొలగించి గండ్లు పడ్డ నాలుగు చోట్ల దారి ఏర్పరచుకున్నారు. స్థానిక నాయకులు, ఎమ్మెల్యే, ఎంపీ, అధికారులతో కలిసి కట్టను పరిశీలించి తాత్కాలిక మరమ్మతుల కోసం 80 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. ఆ నిధులతో వాహనాల రాకపోకలకనుగుణంగా కట్టపై పడ్డ గండ్లను కొంత మేర పూడ్చి వేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ కట్ట రాకపోకలకు మాత్రమే ఉపయోగపడుతోంది తప్ప చెరువులో నీటి నిల్వకు ఉపయోగపడటం లేదు. రెండున్నరేళ్ల నుంచి చెరువులో నీరు లేనందువలన అంతర్భాగంలో దట్టంగా కంపచెట్లు పెరిగిపోతున్నాయి. పశువులు గ్రాసం మేసేందుకు కూడా పనికి రాకుండాపోతోంది. అలాగే ఆయకట్టులో కూడా పంటల సాగు లేకపోవడంతో పొలాలన్నీ కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. రెండున్నరేళ్లుగా 1100 ఎకరాలు నిరుపయోగమైపోయాయి. ఫలితంగా వందలాది మంది రైతులు, రైతు కూలీలు ఉపాధి కోల్పోయారు. ఒక్కసారి ఈ చెరువు నిండితే రబీలోనూ, ఖరీఫ్‌లోనూ రెండుసార్లు పంట చేతికొస్తుంది. ఈ చెరువు కింద 8 గ్రామాల ప్రజలకు భూములుండగా ఆరు గ్రామ పంచాయతీల నుంచి వ్యవసాయ కూలీలు ఉపాధి పొందుతుంటారు.

చెరువు తెగిపోయినప్పుడు స్థానిక నాయకులతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ పరిశీలించారు. మరుసటి వారంలోనే ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు కూడా పరిశీలించారు. కట్టపై పడ్డ నాలుగు గండ్లు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేసేందుకు జలవనరుల శాఖ రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఆ శాఖ సిబ్బంది తెలిపారు. అలాగే పెనగలూరు నుంచి కోడి చిన్నయ్యగారిపల్లె వరకు కట్టపైన తారురోడ్డు నిర్మించేందుకు కృష్ణబాబు ప్రత్యేకంగా ఎస్టిమేట్ పంపించారని కూడా చెప్పారు. రెండున్నరేళ్లు కావస్తున్నా చెరువు కట్ట శాశ్వత మరమ్మతుల ఊసే కనిపించలేదు. మండలంలోనే అతిపెద్దదైన ఈ చెరువు ఒకసారి నిండితే చుట్టూ 20 గ్రామాలలోని బోర్లకు పుష్కలంగా నీరొచ్చి సాగు, తాగునీటికి కొరత లేకుండా ఉంటుంది. రెండున్నరేళ్లుగా చెరువు ఖాళీగా ఉండటంతో పరిసర గ్రామాలలో నీటి ఎద్దడి మొదలైంది. రాబోవు ఖరీఫ్ నాటికి ఫిల్టర్ పాయింట్లు, బోర్లు ఎండిపోతాయేమోనని రైతులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా జలవనరుల శాఖ ద్వారా కట్ట మరమ్మతుల కోసం పంపిన ఆరు కోట్ల అంచనాలు అన్ని గాలిపుకార్లేనని ప్రజలను నమ్మించడానికి అధికార పార్టీ నాయకులు చెబుతున్న మోసపూరిత మాటలేనని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం మారితే తప్ప ఈ చెరువుకు మోక్షం కలగలేదని అనుకుంటున్నారు. ఈ చెరువుకు పూర్వవైభవం ఎప్పుడొస్తుందా అని మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈని వివరణ కోరగా ఆయన స్పందించడం లేదు.

**పశువులకు మేత దొరకడం కూడా గగనమైపోయింది..**



చెరువులో నీరున్నపుడు ఆయకట్టులో పుష్కలంగా పశువులకు పచ్చి మేత లభిస్తుంది. పంటలు కోసిన తరువాత కూడా అదే పదునుతో పెద్ద పెసర, పిల్లిపెసర, అలసంద, మినుము తదితర వాటిని సాగు చేసి దానిని పశువుల మేతకోసమే వాడుతుంటాం. అదే సమయంలో వరిగడ్డిని వాములు తొక్కి ముందు రోజుల కోసం భద్రపరుస్తాం. చెరువులో నీరు ఎండిపోయినపుడు దాని అంతర్భాగంలో కూడా పచ్చిగ్రాసం బాగా దొరుకుతుంది. రెండున్నరేళ్లుగా చెరువు ఖాళీగా ఉండటంతో కనీసం పశువులకు గ్రాసం దొరకడం కూడా గగనమైపోయింది.

**- కోడూరు పెద్ద నరసింహులు, పాడి రైతు, పెనగలూరు**

**రెండు పంటలకు ఢోకా ఉండదు..**



పెనగలూరు చెరువు ఒకసారి నిండి అలుగు పారితే రెండు పంటలకు ఢోకా ఉండదు. రుతుపవనాల్లో సరిగ్గా వర్షాలు కురిసి అక్టోబరు, నవంబరు నెలల్లో చెరువులో నీటిని బట్టి రైతులు నార్లు పోసుకుంటారు. రబీలో వరి సాగు చేసినా ఖరీఫ్‌లో ఆరుతడి పంటైనా పండిస్తారు. చెరువులో నీరు లేకపోవడం వలన రెండున్నరేళ్లుగా ఆయకట్టు పశువులు మేతకోసం గ్రాసం పెంచుకునేందుకైనా నీరులేకపాయె.

**- అంకాని సుబ్బనరసయ్య, ఆయకట్టు రైతు, పెనగలూరు**



చిట్టడవిలా కనిపిస్తున్న ఆయకట్టు భూములు



కట్ట కొట్టుకుపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్న తూము



కట్ట పక్కన పడ్డ పెద్ద గొయ్యి అలాగే ఉన్న దృశ్యం

## ఐదేళ్లలో కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయాం...

- టీడీపీ అధికారంలోకి వస్తే ప్యాంటు, చొక్కా ఊడదీస్తారు
- కార్యకర్తల సమావేశంలో ఎంపీ మిధున్‌రెడ్డి
- సమావేశానికి డుమ్మా కొట్టిన పలువురు నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

సుండుపల్లె, మార్చి10: ఐదేళ్ల కాలంలో కార్యకర్తలకు సరైన న్యాయం చేయలేకపోయామని, టీడీపీ అధికారంలోకి వస్తే వైసీపీ నాయకులు, కార్యకర్తల ప్యాంట్లు, చొక్కాలు ఊడదీస్తారని, ఈ విషయాన్ని గుర్తుంచుకుని వర్గాలు లేకుండా అందరూ కలసికట్టుగా పనిచేయాలని ఎంపీ మిథున్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు తెలిపారు. సుండుపల్లెలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎంపీతో పాటు రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో కార్యకర్తలందరికీ న్యాయం చేయలేకపోయామని తెలిపారు. ఇప్పటివరకు పట్టించుకోని వారు ఇప్పుడు కలిసి పనిచేద్దామని మాట్లాడడం విడ్డూరంగా ఉందని పలువురు కార్యకర్తలు సమావేశం జరుగుతుండగానే గుసగుసలాడుకున్నారు. సమావేశానికి వైసీపీ జిల్లా సమన్వయకర్త ఆరంరెడ్డి, తిరుమలరెడ్డి శివారెడ్డి, మాజీ ఎంపీటీసీ మహేశ్వర్‌రెడ్డి, భాగంపల్లి అజయ్‌కుమార్‌రెడ్డి, సుమారు 6 మంది సర్పంచులు, 5 మంది ఎంపీటీసీలతో పాటు కార్యకర్తలు, నాయకులు సమావేశానికి డుమ్మా కొట్టారు. అయితే కొంత మంది సర్పంచులు, సింగిల్‌విండో అధ్యక్షులు, ఎంపీటీసీలకు సభా వేదిక మీదస్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తల సమావేశంలో కనీసం ఒక్క కార్యకర్తకు కూడా ప్రసంగించే అవకాశం ఇవ్వలేదని బహిర్గతంగా మాట్లాడుకుంటూ నిరుత్సాహంతో కార్యకర్తలు వెనుదిరిగారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు సంవత్సరాలు మమ్మల్ని పట్టించుకోలేదు. సమావేశంలో కూడా మా బాధలు చెప్పుకునేలా మాట్లాడే అవకాశం ఇవ్వలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

## నంది వాహనంపై వీరబ్రహ్మేంద్రస్వామి



నంది వాహనంపై ఊరేగిన వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ

బ్రహ్మంగారిమఠం, మార్చి 10 : శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున పోతులూరివీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ కన్నులపండువగా, వైభవంగా నందివాహనంపై స్వామి నివాసగృహం పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవాన్ని దేవస్థానం వారు నిర్వహించారు. స్వామివారికి గ్రామంలోని ప్రజలందరూ కాయకర్పూరం సమర్పించారు. అనంతరం దేవస్థానం ఆవరణంలో గజవాహనంపై స్వామివారిని ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కాగా ఆదివారం మహా ప్రసాదం రోజు కావడంతో భక్తులకు దేవస్థానం సిబ్బంది ప్రసాదాన్ని అందించారు.

**సింహవాహనంపై జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారు..:** ఈశ్వరీదేవి అమ్మవారు మహాశివరాత్రి పురస్కరించుకుని ఆదివారం గ్రామోత్సవం చేశారు. అనంతరం ఈశ్వరీదేవి దేవస్థానం వారు భక్తులకు మహా ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

## ప్రకృతి సౌందర్యానికి ప్రతిరూపం 'లంకమలదారుల్లో' పుస్తకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసరు రాంప్రసాద్‌రెడ్డి


కడప (ఎడ్యుకేషన్), మార్చి 10 : లంకమల వివేక్ రచించిన లంకమల దారుల్లో పుస్తకం ప్రకృతి సౌందర్యానికి ప్రతిరూపమని సీపీ బ్రౌన్ ఉపసంచాలకుడు ప్రొఫెసరు రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో లంకమల దారుల్లో.. పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేక్ రచించిన లంకమల దారుల్లో పుస్తకం కేవలం యాత్రా సందర్శన పుస్తకమే కాక విజ్ఞాన దాయక కథాంశాలతో కూడుకున్న విశ్లేషాత్మక రచన అని తెలిపారు. ఇన్ టు ద నేచర్ సభ్యులంతా కలిసి లంకమల అభయారణ్యాన్ని రేయింబవళ్లు తిరిగి వారి అనుభవాలను పుస్తకంగా రూపొందించి లంకమలను అందరికీ చేరువ చేశారన్నారు. అనంతరం రాజకీయ విశ్లేషకులు శివరాచర్ల, బద్వేలు ఆర్డీవో ఆకుల వెంకటరమణ, సాయంకాలం దినపత్రిక ఎడిటర్ వెంకటరెడ్డి , పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు రాజేశ్వరి, శివానందరెడ్డి, సరస్వతి, గోవర్ధనరెడ్డి, సుధీర్‌రెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో వివేక్ కుటుంబ సభ్యులు, వైవీయు అధ్యాపకులు ప్రొఫెసరు రమాదేవి, ప్రొఫెసరు కాత్యాయని, సీపీ బ్రౌన్ కేంద్రం పరిశోధకుడు భూతపురి గోపాలక్రిష్ణ, చింతకుంట శివారెడ్డి, జి.హరిభూషణ్ రావు, ఆర్.వెంకటరమణ, శ్యాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## కడపలో నేటి స్పందన తాత్కాలికంగా రద్దు

కడప (కలెక్టరేట్), మార్చి 10: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ ఈనెల 11న కడప జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో కడప కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## శివమాల భక్తులు శ్రీశైలం పయనం

కలకడ, మార్చి 10: కలకడ మండలానికి చెందిన శివమాల భక్తులు శ్రీశైలంలో కొలువైన మల్లికార్జునస్వామిని దర్శించుకొనేందుకు ఆదివారం ఉదయం బయలుదేరారు. గురుస్వామి వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 41 రోజుల దీక్షలో ఉన్నవారు. ఝరిలో స్నానాలు చేసి శైకత లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడులు ధరించి 40 మంది భక్తులు బయలుదేరారు.




**WANTED**

కడపటౌన్‌లోని GMRస్కూల్‌లో పనిచేయుటకు అనుభవజ్ఞులైన ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ (1 To 5) మరియు హైస్కూల్ (6 To 10) టీచర్లు (అన్నిసబ్జెక్టులకు), హాస్టల్ వార్డెన్‌లు మరియు అడ్మిషన్స్ చేయుటకు PROలుకావలెను. సెల్: 99000 41111, 73821 83100
Ajc-176340

**LEASE**

కడప నగరం భాగ్యనగర్ కాలనీ ఆహ్లాదకరమైన వాతావరణంలో 21 రూములు Leaseకు ఇవ్వబడును. కాలేజీలకు, హాస్పిటల్స్‌కు, స్కూల్లకు లేడీస్ హాస్టల్‌కు ఇవ్వబడును మరియు కళ్యాణమండపం కూడా లీజుకు ఇవ్వబడును. Cell : 99592 14054
Ajc-185418

**బంగారం కొనబడును**

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. నం॥ 7382114647
AJA- 176971

**ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి**

**యూనిట్ కార్యాలయం**
**9985411183**
**9985411189**

**స్లిమ్మింగ్ & న్యూట్రిషన్**

దియాన్ నాన్ సర్జికల్ స్లిమ్మింగ్ & న్యూట్రిషన్ క్లినిక్‌నందు పనిచేయుటకు Receptionists మరియు ఫిజియోథెరపిస్ట్‌లు కావలెను. Qualification:Receptionist - Degree / Inter, Physiotherapist - BPT, Phone No.: 86860 18602, Address : Sandhya Circle, Kadapa.
Ajc-188959

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

# ప్రభుత్వ భూముల కబ్జా.. అధికారులకు పట్టదా?: సీపీఐ


కబ్జా స్థలం వద్ద సీపీఐ సభ్యులు

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 10: ప్రభుత్వ భూముల కబ్జా అధికారులకు పట్టదా అని సీపీఐ నగర కార్యదర్శి వెం కటశివ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం 15వ డివిజన్ పరిధిలోగల సాగర్‌కాలనీ వద్ద మూడు ఎక రాల ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తుండటంతో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయల విలువచేసే మూడు ఎకరాల ప్రభుత్వ భూ మి చిన్నచౌకు గ్రామ పొలం సర్వే నెం. 1130లో సాగర్ కాలనీ వద్ద క్రమేపీ అన్యా క్రాంతమవుతుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఎన్నికల నిర్వహణ హడావు డిలో ఉన్న నేపథ్యంలో కబ్జారాయుళ్లు ఆదివారం కడప నగరంలో మిగిలి ఉన్న ప్రభుత్వ స్థలాల కబ్జాకు ఇదే అద నుగా భావించి అన్యాక్రాంతానికి పాల్పడుతున్నారన్నారు. కడప - రాజంపేట ప్రధాన రహదారికి దగ్గరలో ఉన్న ఈ స్థలం కబ్జాకు ఏళ్ల తరబడి విఫలయత్నం చేస్తున్నార న్నారు. గతంలో కడప మండల రెవెన్యూ అధికారులు నాటిన ప్రభుత్వ స్థలం బోర్డును సైతం పీకేసి భూకబ్జారా యుళ్లు బరితెగించారన్నారు. వెంటనే వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉర్దూ బాయ్స్ రె సిడెన్షియల్ స్కూలు పక్కన, బుడ్డాయపల్లె చెరువు దగ్గ రలో ఉన్న కోట్లాది రూపాయల విలువచేసే ఈ స్థలాన్ని గత 15 ఏళ్లుగా సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వ హించి కాపాడుకుంటున్నామన్నారు.స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి భూ మిని రక్షించాలని సంబంధిత ఉన్నతాధికారు లకు ఏళ్ల తరబడి విన్నవించినా ఉపయోగం లేదన్నారు. అక్రమార్కులు పదిరోజుల కిందట ఈ స్థలాన్ని చదను చేస్తున్నప్పుడే సంబంధిత తహసీల్దారు, ఆర్డీఓలకు విన్న వించామన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి భూకబ్జాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే సీపీఐ నేతృత్వంలో సొంతిల్లు లేని నిరుపేదలు భూపోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించా రు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గసభ్యులు టక్కోలి మ నోహర్‌రెడ్డి, బ్రహ్మం, శంకర్‌నాయక్, మల్లికా ర్జున, సుబ్బరాయుడు, భాగ్యలక్ష్మి, ఈశ్వరయ్య, మహేశ్, పద్మావతి, నరసింహ, కర్ణ, సాయి పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న మాజీ మంత్రి అహ్మదుల్లా

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 10 : విద్యతోనే పిల్లల ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని మాజీ మంత్రి అహ్మదుల్లా పేర్కొ న్నారు. ఆదివారం ఉదయం కడప నగరం రవీంద్రనగర్ లోని మద్రస ఫైజే అబ్రార్ 20వ వార్షికోత్సవ సభను బు ఖారియా మసీదులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్యఅతిథులుగా హాజరైన మాజీ మంత్రి అహ్మ దుల్లా, సంఘ సేవకుడు సలావుద్దీన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సయ్యద్‌హమీద్, సయ్యద్ బషీర్ సోదరులు మద్రస ఫైజే అ బ్రార్ ద్వారా విద్యార్థులకు ఉ చితంగా అరబిక్, ఉర్దూ భాషల్లో విద్యాబోధ న అందిస్తు న్నారన్నారు. గౌరవ అతిథులు మౌలానా కరీముల్లా మా ట్లాడుతూ తల్లిదండ్రులు పాఠశాల విద్యతోపాటు తమ పిల్లలకు అరబిక్, ఉర్దూ భాషల్లో ప్రా వీణ్యం సంపాదించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు.
సభాధ్యక్షుడు మద్రస ఫైజే అబ్రార్ ప్రిన్సిపాల్ ముఫ్తి సయ్యద్ ఆసిం మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో మౌలానా లియాఖత్ అలీ బాఖవి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ నజీర్ అహ్మద్, కడప ఇస్లామిక్ సొసైటీ ముఖ్యులు బాబుబాయి మాట్లాడారు. అరబిక్ పండితులు హఫీజ్‌షా నవాజ్, హఫీజ్ జైనుల్ అబిదీన్, హఫీజ్ ఖాదర్‌బాషా, హఫీజ్ అబ్దుల్‌గఫ్ఫార్, హఫీజ్ ఉబేదుల్లా, నాయకులు విష్ణుప్రీతంరెడ్డి, అబు తల హా, రహ్మతుల్లాఖాన్, మహ్మద్ షఫి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# 'మైనార్టీలకు కాంగ్రెస్‌లోనే రక్షణ'


కాంగ్రెస్‌లోకి మైనార్టీలను ఆహ్వానిస్తున్న తులసిరెడ్డి

కడప(కలెక్టరేట్), మార్చి 10: మైనార్టీలకు కాంగ్రెస్ పా లనలోనే రక్షణ ఉంటుందని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీ సీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని రవీంద్రనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో తులసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీలోకి ఆహ్వానించిన తులసిరెడ్డి మాట్లాడుతూ జగన్ సర్కారులో మైనార్టీ కార్పొరేషన్ నిర్వీర్యమైంద న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్, ప్రధాన కార్యదర్శి సత్తార్, రాష్ట్ర కార్య దర్శి చీకటి చార్లెస్, పొట్టిపాటి చందరశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ అలీఖాన్, సంఘ సేవకుడు సలా వుద్దీన్, రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య, లక్ష్మయ్య, ఆరీ పుల్లా, శ్యామలమ్మ సమీరా పాల్గొన్నారు.

# డ్వామా పీడీకి ఎన్నికల బాధ్యతలు కేటాయించవద్దు

● కలెక్టర్‌కు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి వినతి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 10 : సార్వత్రిక ఎన్నికలలో విశ్రాంతి అధికారి, ప్రస్తుతం ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డిని ఎన్నికల విధుల్లో ఉపయోగించ వద్దని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరుకు ఆయన వినతిపత్రం అందిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల పరిశీల కులకు ప్రోటోకాల్ ఏర్పాటు చేసే బాధ్యతను ఆయనకు అప్పగించారన్నారు. అయితే ఇక్కడ దుర్వినియోగం జరిగే అవకాశం ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఉత్పన్న మయ్యే సమస్యలను ప్రజలు, పార్టీలు కేంద్ర ఎన్నికల పరి శీలకుల దృష్టికి తీసకువచ్చే క్రమంలో భాషా సమస్య వస్తుందన్నారు. యదుభూషణ్‌రెడ్డి అధికార పార్టీకి అను కూలమైన అధికారి కాబట్టి విషయం తర్జుమా చేసే సమ యంలో సరిగ్గా చేయకపోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం మాన్యువల్‌లో కూడా సర్వీ సును ఎక్స్‌టెన్షన్ చేసిన వారిని ఉపయోగించుకోకూడదని స్పష్టంగా చెప్పారన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఇచ్చి మెమో ప్రకారం నిబంధన 5లోని ఉప నిబంధన 7లో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన అనేక ఎన్నికల సమీక్షల్లో యదుభూషణ్ రెడ్డి పాల్గొన్నట్లు పత్రికల్లో కూడా వచ్చిందన్నారు.






## టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా షేక్ బాషా

కడప (ఎడ్యుకేషన్), మార్చి 10 : టీడీపీ జాతీయ అధ్య క్షుడు నారా చంద్రబాబునాయుడి ఆదేశాల మేరకు టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యద ర్శిగా కడప నియోజకవర్గానికి చెందిన షేక్ ఎస్‌దినిబాషాను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఆయన టీడీపీ అధిష్టానానికి ధన్యావాదాలు తెలిపారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

పులివెందుల టౌన్, మార్చి 10: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రెండు రోజుల నుంచి కలెక్టర్ విజయరామ రాజు, ఎస్పీ సిద్దార్థ కౌశల్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రె డ్డి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆదివారం ఎస్పీ పోలీసు లకు దిశానిర్దేశం చేశారు. పట్టణంలో దాదాపు 1462 మంది పోలీసులను నియమించారు.






# రాష్ట్ర సమగ్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం: పుత్తా


వీరపునాయునిపల్లెలో పుత్తా నరసింహారెడ్డికి ఘనస్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

వీరపునాయునిపల్లె, మార్చి 10: రాష్ట్ర సమగ్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్య క్షుడు పుత్తా నరసింహారెడ్డి అ న్నారు. ఆదివారం స్థానిక డిగ్రీ కళాశాలలో మాజీ ఎంపీపీ ప్ర సాద్‌రెడ్డి, మండల కన్వీనర్ బై రెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్ష తన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మాట్లాడుతూ 2004లో ప్రా రంభమైన సర్వరాయసాగర్ ప నులు ఎక్కడ వేసిన గొంగళి అ క్కడే అన్న చం దంగా ఉన్నాయన్నారు. ఈ కట్ట పనులు లీకేజీలకు నిలయంగా మారాయన్నారు. టీడీపీ హ యాంలో 80శాతం పనులు పూర్తయినా ఇప్పటికీ కట్టమీ ద ఉన్న కంపచెట్లను కూడా తొలగించలేదన్నారు. కట్ట ప నులు, కుడి, ఎడమ, ఉపకాల్వలు, డిస్ట్రిబ్యూటర్ పనులు పూర్తిచేసేందుకు నిధులు ఉన్నా పనులు మొదలు పె ట్టలేదన్నారు. చంద్రబాబు పాలనలో రైతులకు ఇన్సూరెన్స్, సబ్సిడీపై రైతులకు ట్రాక్టర్ అందజేశారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటేసి చంద్రబా బును ముఖ్యమంత్రిగా తనను కమలాపురం ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అలాగే టీడీపీ ప్రవేశపెట్టిన మేని ఫెస్టో ద్వారా ఒక్కో కుటుంబానికి చేకూరే లబ్ధిని ఇంటిం టికీ వెళ్లి వివరించాలన్నారు. టీడీపీ మండల కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, యువ నాయకులు చైతన్యరెడ్డి, లక్ష్మీరెడ్డి, సాయినరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సంగమేశ్వర ఆలయం మాజీ చైర్మన్ మురళీధర్‌రెడ్డి, ఉరుటూరు మురళీదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సంజీవరెడ్డి, కొమ్మద్ది మాజీ ఎంపీటీసీ సూరా రెడ్డి, పాయసంపల్లె రమణారెడ్డి, పోలీస్‌రాజ, తలపనూరు గంగిరెడ్డి, వీఎన్‌పల్లె అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**పుత్తాకు ఘన స్వాగతం**

వీరపునాయునిపల్లెలో కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లిన పుత్తా నరసింహారెడ్డికి టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజ యభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వ ర్యంలో సుమారు 500 మంది టీడీపీ శ్రేణులు భారీ జనస మీకరణతో బైకు ర్యాలీ నిర్వహించారు. డప్పు వాయి ద్యాలు, బాణసంచాలు పేలుస్తూ, గజమాలతో ఘనస్వా గతం పలికారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అలిదెన సర్పంచు ఓబులేసు, పాలగిరి గోపీనాథ్‌రెడ్డి, మిట్టపల్లె సుదర్శన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డిపల్లె మాజీ సర్పంచు గోపాల్, ఎస్‌ఆర్‌పేట జనార్దన్‌రెడ్డి, లోకేష్‌యాదవ్, చైతన్య కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు రైతులకు శిక్షణ

చెన్నూరు, మార్చి 10:మండలంలోని రైతులకు చెన్నూ రు ఆర్‌బీకేలో సోమ, మంగళ వారాల్లో శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారిణి శ్రీదేవి తెలిపారు. ఈ శిక్షణా శిబిరాల్లో ఊటుకూరు వ్యవ సాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు హాజరై రైతు లకు పంటల సాగు, తక్కువ ఖర్చుతో ఎక్కువ లా భాలు, ఎలాంటి పంటల సాగు వల్ల ప్రయోజనం, వాటి మార్కెట్, పెట్టుబడి తగ్గించగడం, కొత్త వంగ డాల సాగు విషయాలపై శిక్షణ ఇస్తారన్నారు. రెండురో జుల పాటు నిర్వహించే ఈ శిక్షణ శిబిరం సోమవారం ఉదయం 10గంటలకు ప్రారంభిస్తారని, అందులో అన్ని విభాగాలకు సంబంధించిన శాస్త్రవేత్తలు హాజరై రైతుల సమస్యలకు సందేహాలు నివృత్తి చేస్తారన్నారు. కావున తప్పక హాజరై పంట సాగులో మెళకువలు తెలుసుకో వాలని సూచించారు.

## ఇందిరమ్మ అభయం.. పేదలకు వరం

వేంపల్లె, మార్చి 10: ఇందిరమ్మ అభయం పేదలకు కాంగ్రెస్ వరమని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి పే ర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ అభయం పథ కాన్ని అమలు చేస్తుందన్నారు. ఇది ఒక చారిత్రాత్మక పథకమని, దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదే శ్‌లో కాంగ్రెస్ ప్రారంభిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రతినెల రూ.5000 ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ మొత్తం కుటుంబ పె ద్ద అయిన మహిళ ఖాతాకు జమ అవుతుందన్నారు. ఏ పేద కుటుంబం కూడా ఆర్థిక ఇబ్బందులకు గురికా కూడదన్న సదుద్దేశంతో ఈ పథకాన్ని ప్రకటించినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల డబ్బు కలిపిన ఇందిరమ్మ అభయం పథకానికి సాటిరావన్నారు.

## 'ఉర్దూను పటిష్టంగా అమలు చేసేందుకు అందరూ సహకరించండి'

కడప (ఎడ్యుకేషన్), మార్చి 10 : ఉర్దూ పటిష్ట అమ లుకు సహకరించాలని రూటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ కోరారు. ఆదివారం హజ్ కమిటీ చైర్మ న్ గౌస్‌లాజంకు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 80 ల క్షల మంది ఉర్దూను మాతృభాషగా ఆదరిస్తున్నారని, లక్షల సంఖ్యలో విద్యార్థులు, వేల సంఖ్యలో ప్రభుత్వ ఉ ద్యోగులు సేవలందిస్తున్నారన్నారు. దీంతో ఉర్దూను ప టిష్టంగా అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు. రూటా ప్రతినిధులు షాహిదుల్లా, మహ్మద్ ఆయుబ్, ఫక్రుద్దీన్, అబ్దుల్ హకీం, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

## పెద్దచెప్పలిలో ఘర్షణ

కమలాపురం రూరల్, మార్చి 10: మండలంలోని పెద్ద చెప్పలిలో ఆదివారం ఉదయం సాయినాథశర్మ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. స్థానికుల సమాచా రం మేరకు.. సోమవారం ఉదయం పెద్దచెప్పలి గ్రా మంలో సాయి ఆత్మీయ సమ్మేళన సభ ఏర్పాటు చేశా డు. ఈ సందర్భంగా టీడీపీ వర్గీయులతో ఆయన వర్గీ యులు దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. దీంతో ఇరువర్గాల వారు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని రా ళ్లతో దాడులు చేసుకున్నారు.
ఈ దాడిలో పలువురికి గాయాలైనట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్‌ఐ రుషికేశవరెడ్డి, పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గా లను చెదరగొట్టారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా సంఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ తెలిపారు.

# మాధవీరెడ్డి విజయానికి బాటలేస్తాం: టీడీపీ


శ్రీనివాసరెడ్డి దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

కడప (మారుతీనగర్), మార్చి 10: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కడప నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరి లో ఉన్న ఆర్.మాధవీరెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించేందుకు బాటలేస్తామని తెలుగుదేశంపార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు పేర్కొన్నారు. ఆ మేరకు ఆదివారం నగర 20వ డివిజన్ యర్రముక్కప ల్లెలో గల ఆమూరి స్వగృహంలో ఏర్పాటుచేసిన అల్పా హార కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస రెడ్డి- ఆయన సతీమణి ఆర్. మాధవీరెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అనంతరం వారికి తిరుమల వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ బుగ్గవంక పరీవాహక ప్రాంతాలలో నివశించే నిరుపేద ముస్లిం, మైనార్టీ ప్రజ లకు సరైన మౌలిక సదుపాయాలు ఆశ్రయం కల్పించ డంలో వైసీపీ సర్కార్ పూర్తిగా చేతులెత్తేసిందన్నారు.ఈ విషయంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సైతం ఏ మా త్రం శ్రద్ధ కనబరచకపోవడం దారుణమన్నారు. కావున ప్రజలు మరోసారి మోసపోకుండా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు హరిప్రసాద్, పార్టీ నాయకులు శంకర్, మాసాపేట శివ, నాయకులు మల్లికా ర్జున, హనీఫ్, మహేష్, శివారెడ్డి, దస్తగిరి, ప్రసాద్, నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల బాధలు అరణ్యరోదనలు

● ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న ఎస్సీఎస్టీ ఉపాధాయద్యాయ సంఘాల ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 10: ఈ ప్రభుత్వంలో ఉద్యోగ ఉపాధ్యాయుల బాధలు అరణ్యరోదనలుగా మారాయని ఎ స్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు మేకల శివార్జున తెలిపారు. ఆదివారం కడప నగరం కొత్త బస్టాండు అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భం గా ఆ యన మాట్లాడుతూ మంత్రులు, ప్రభుత్వ పెద్దలు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు సీఎం జగన్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులకు క్రమం తప్ప కుండా డీఏలు ఇస్తామని చెప్పిన విషయం గుర్తు చేశారు. అయితే కరోనా పేరు చెప్పి కొన్ని డీఏలు మాఫీ చేశారని తెలిపారు. ప్రస్తుతం మూడు డీఏలు పెండింగులో ఉన్నా యని వీటిని వెంటనే విడుదల చేయాలన్నారు. అదే వి ధంగా పీఆర్‌సీ, ఐఆర్ చెల్లిస్తామని సీపీఎస్ రద్దు చేస్తాం అని చెప్పి హామీ ఇచ్చారని, అతీ గతీ లేదన్నారు.తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట అసో సియేట్ ప్రెసిడెంట్ శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శ న్‌బాబు, ప్రధాన కార్యదర్శి గంగరాజు, నాయకులు గంగా ధర్, సురేంద్ర, ఏడీ దేవదత్తం పాల్గొన్నారు.

# గ్లకోమాపై అవగాహన కోసం ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కడప (నాగరాజుపేట), మార్చి 10 : ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా కడపలోని పుష్పగిరి విట్రియో రెటినా ఇనిస్టిట్యూట్, డీబీసీఎస్ ఆధ్వర్యంలో గ్లకోమాపై ఆదివారం కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి రాజీవ్ పార్కు మీదుగా మౌన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీ ఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, డీపీఎం డాక్టర్ సునీత జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పుష్పగిరి కంటి ఆసుపత్రి యూనిట్ హెడ్ సూర్యప్రకాశ్, జీఎం సురేష్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ నాగరాజు గ్లకో మా నిర్వహణపై మాట్లాడారు. కంటిని క్రమం తప్ప కుండా తనిఖీ చేయించడం వల్ల సైలెంట్ కిల్లర్ గ్లకో మాను నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా కంటి ఆసు పత్రి ఆధ్వర్యంలో గ్లకోమా వ్యాధిపై అవగాహన, నిర్వహ ణపై కరపత్రాలు పంచిపెట్టారు.

# 'కడప నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గెలుపు తథ్యం'


సమావేశంలో మాట్లాడుతున్న చెన్నంశెట్టి మురళి

కడప (మారుతీనగర్), మార్చి10: కడపలో టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి గెలుపు తథ్యమని గ్రేటర్ రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడు చెన్నంశెట్టి మురళి కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. రాజంపేటలో తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన బత్యాలను పార్టీ అధిష్టానం విస్మరించడం సరైందికాదన్నారు. బలిజ వర్గీయులకు కడప నగరంలో ఒక బలిజ కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని అధికారంలో ఉన్న వైసీపీ నేతలందరి దృష్టికి తీసుకెళ్లినా స్పందనే లేదన్నారు.

# సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● టీడీపీ కడప నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి


కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరిన 6వ డివిజన్ ప్రజలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 10 : టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో భాగంగా ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి పిలుపుని చ్చారు. ఆదివారం కడప నగరం 10వ డివిజన్ అప్సరా సర్కిల్ నుండి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. అలాగే టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అబివృద్ధికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్టాన్ని వైసీపీ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. ఆర్థికంగా రాష్ట్రం బలపడాలంటే అత్యంత అనుభవం ఉన్న చంద్రబాబు సీఎం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రజలందరూ చంద్రబాబును సీఎం చేసేందుకు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, నగర అధ్యక్షులు శివకొండారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, యాటగిరి రాంప్ర సాద్, కొమ్మలపాటి సురేష్, మాసాపేట శివ, రాజగోపాల్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, రమణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీలోకి భారీగా చేరికలు**

కడప నగరం 6వ డివిజన్ కొండాయపల్లె, విద్యుత్‌నగర్‌లో కట్టదిలీప్ నేతృత్వంలో అధిక సంఖ్యలో స్థానికులు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి శ్రీనివాస రెడ్డి, మాధవీరెడ్డిలు ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త ఒక సైనికుడులా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజగోపాలరెడ్డి, ప్రసాద్, పూర్ణ, నాగేంద్ర, రాజు, పార్వతి, కిరణ్, హర్ష తదిత రులు పాల్గొన్నారు.

## పుట్టా గెలుపు కోసం కృషి చేస్తా

### టీడీపీ జిల్లా కార్యనిర్వాక కార్యదర్శి నేట్లపల్లి మల్లికార్జున యాదవ్



మాట్లాడుతున్న పుట్టా సుధాకర్‌యాదవ్, మల్లికార్జునయాదవ్

మైదుకూరు రూరల్ మార్చి 10 : తెలుగు దేశం మైదుకూరు నియోజకవర్గ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ గెలుపుకోసం అహర్నిశలు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నేట్లపల్లి మల్లికార్జునయాదవ్ తెలిపారు. ఆదివారం మండలంలోని పెద్దశెట్టిపల్లె నేట్లపల్లి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం రెడ్యం వెంకటసుబ్బారెడ్డితో పాటు వైసీపీలో చేరినప్పటికీ, ఆదివారం పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో సొంతగూటికి చేరుతున్నట్లు ప్రకటించారు. కొంత అయోమయంలో వైసీపీలో చేరుతున్నట్లు ప్రకటించినప్పటికీ పంచాయతీలో బంధువర్గం,స్నేహితులందరూ టీడీపీలోనే కొనసాగాలనే మాటపై, తన నిర్ణయం వెనక్కితీసుకొని మళ్లీ టీడీపీలోనే కొనసాగాలని నిరయించుకున్నానని ఆయన పేర్కొన్నారు. ఇక తన నిర్ణయం మారదని ,తుది శ్వాస వరకు తెలుగుదేశంలోనే ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు భీమయ్యఏపీ రవీంద్ర,కాలువ గురప్ప, కిషోర్, చిన్‌రెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, కొండపల్లి ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి వంద కుటుంబాలు చేరిక

పోరుమామిళ్ల, మార్చి 10 : పోరుమామిళ్ల మండలంలో కొత్త రామాయణపు వీధిలో సీతా వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 40 కుటుంబాలు టీడీపీలో చేరారు. అలాగే రంగసముద్రం పంచాయతీ పరిధిలోని రాగవేంద్రనగర్ ఎస్టీకాలనీలో వైఎస్ఆర్ నుంచి తిరుమలశెట్టిసుబ్బారావు, ఓబులేసు, జగన్నాథం నాగయ్య ఆధ్వర్యంలో 60 మంది టీడీపీలో చేరారు. ఆదివారం పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలోని కొత్త రామాయణపువీధిలో టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, లకిడి రఘురాములు, సీతా బాలాజీ, తిరుమల శెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్ అధ్యక్షతన యువ నేత రితీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ ఇన్‌చార్జి రోశన్న సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, టీడీపీ నాయుకులు కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, హబీబున్నీసా, అరుణమ్మ, ఎంపీటీసీ కల్వకూరి రమణ, మురళి, ఇమాం హుసేన్, పట్టణ అధ్యక్షులు మస్తాన్, మార్కెట్‌యార్డు మాజీ వైస్ ఛైర్మన్ ఎస్ఎం బాషా, రామసుబ్బారావు, తోట బ్రహ్మయ్య, ప్రొఫెసరుబాషా, రంతుల్లా, కరీముల్లా, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రంగసముద్రం పంచాయతీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో పోరుమామిళ్ల యనమల సుధాకర్, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, తిరుమలశెట్టి సుబ్బారావు, చెరుకూరి చెన్నరాయుడు, కల్వకురి రమణ, నడిపి వెంకటసుబ్బయ్య, నడిపి ఓబులేసు, ర మణయ్య, పాపయ్య, జగన్నాథం నాగయ్య పాల్గొన్నారు.

## యాదవసమాజ అన్నదాన సత్రానికి రూ.40వేలు విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం, మార్చి 10 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని యాదవ సమాజం అన్నదాన సత్రం అభివృద్ధికి ఇటీవల శివరాత్రి మహోత్సవాల్లో భక్తులకు చేసిన సేవలకు రాబోయే రోజుల్లో అన్నదానం కోసం ఆదివారం చెన్నై వాస్తవ్యులు దర్శనవరం సూరజకుమారి, కాత్యాయని రూ.40వేలు కమిటీ సభ్యులకు అందించారు.ఈ సందర్భంగా చెన్నైవాస్తవ్యులు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో యాదవ అన్నదాన సత్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు శాలువా, పూలమాలతో దాతలకు సన్మానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయాదవ్, ప్రధాన కార్యదర్శి లక్కినేని బాలరాజుయాదవ్, కోశాధికారి మేకల పెద్దన్నయాదవ్,ఉపాధ్యక్షులు చాగనబోయిన సుబ్బరాయుడుయాదవ్ , క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 12న కార్యకర్తల ఆత్మీయ సమావేశం

● మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు, మార్చి 10: జమ్మలమడుగు పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఈనెల 12వ తేదీన మంగళవారం ఉదయం 9 గంటలకు జమ్మలమడుగు నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, అభిమానుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆదివారం సాయంత్రం తెలిపారు. భూపేశ్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గంలోని ఇప్పటి వరకు వెంట ఉన్న తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు విరివిగా పాల్గొని కార్యకర్తల సమావేశం జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతం

ముద్దనూరు మార్చి10:స్థానిక వైష్ణవీ ఫిల్లింగ్ మిషన్ వద్ద ఆదివారం మానవత ఆధ్వర్యంలో గుండె,నేత్ర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతపురం కిమ్స్,ప్రొద్దుటూరు అభిలాష్ కంటి వైద్యశాల డాక్టర్లు దాదాపు వంద మందికి నేత్ర పరీక్షలు,85 మందికి గుండె పరీక్షలు చేశారు.రక్త పరీక్షలు, 2డీఎకో, ఈసీజీ పరీక్షలు చేసి,ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు మండల అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి,సాంబశివారెడ్డి,వేణుగోపాల్‌రెడ్డి,నాగేంద్రరెడ్డి, డిష్ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల కబ్జా అధికారులకు పట్టదా?: సీపీఐ

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 10: ప్రభుత్వ భూముల కబ్జా అధికారులకు పట్టదా అని సీపీఐ నగర కార్యదర్శి వెం కటశివ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం 15వ డివిజన్ పరిధిలోగల సాగర్‌కాలనీ వద్ద మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తుండటంతో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయల విలువచేసే మూడు ఎకరాల ప్రభుత్వ భూ మి చిన్నచౌకు గ్రామ పొలం సర్వే నెం. 1130లో సాగర్ కాలనీ వద్ద క్రమేపీ అన్యాక్రాంతమవుతుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. కడప - రాజంపేట ప్రధాన రహదారికి దగ్గరలో ఉన్న ఈ స్థలం కబ్జాకు ఏళ్ల తరబడి విఫలయత్నం చేస్తున్నారన్నారు. గతంలో కడప మండల రెవెన్యూ అధికారులు నాటిన ప్రభుత్వ స్థలం బోర్డును సైతం పీకేసి భూకబ్జారాయుళ్లు బరితెగించారన్నారు. వెంటనే వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి భూకబ్జాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే సీపీఐ నేతృత్వంలో సొంతిల్లు లేని నిరుపేదలు భూపోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గసభ్యులు టక్కోలి మ నోహర్‌రెడ్డి, బ్రహ్మం, శంకర్‌నాయక్, మల్లిఖార్జున, సుబ్బరాయుడు, భాగ్యలక్ష్మి, ఈశ్వరయ్య, మహేశ్, పద్మావతి, నరసింహ, కర్ణ, సాయి పాల్గొన్నారు.

# వైసీపీ అరాచక పాలనకు తెరపడనుంది



ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న సీఎం. సురేశ్‌నాయుడు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బద్వేలులో ప్రచారంలో భాగంగా దోశ వేస్తున్న బొజ్జ రోశన్న, రితీష్‌రెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 10 : వైసీపీ అరాచక పాలనకు తెరపడి టీడీపీ సంక్షేమ పాలన వస్తుందని టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 39 వవార్డు లోని హనుమాన్ నగర్, జంగం పేట శ్రీనగర్ కాలనీలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటెయ్యామని కోరారు. కార్యక్రమంలో వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మెట్టుపల్లి ప్రభాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగ రాజు. గంజికుంట ఆంజనేయులు, వెంకటేష్, సిరిసాల ఎల్లప్ప, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

**పోరుమామిళ్ల..:** పోరుమామిళ్లలోని మెయిన్‌బజారు, ఆర్యవైశ్య నగర్‌లో అరుణమ్మ బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమం సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఆదివారం పోరుమామిళ్లలోని అమ్మవారిశాలవీధిలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్,రామసుబ్బారావు, సీతా వెంకటసుబ్బయ్య, హబీబున్నీసా, ఇమాంహుసేన్, సెట్టెం ప్రతాప్, మౌలాలి, నాగరాజు, గాలి మురళి, రవి, టౌన్ అధ్యక్షుడు మస్తాన్, ప్రదీప్, వెంకటేశ్వర్లు, రంతుల్లా, ధర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

**బద్వేలు రూరల్..:** ముఖ్యమంత్రిగా చంద్రబాబు అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా తెలిపారు. ఆదివారం మండలపరిధిలోని చెర్లోబోయిన పల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బైసాని ప్రతాప్‌రెడ్డి, పీరయ్య, యల్లయ్య, జీవీ సుబ్బారెడ్డి, భూమిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**అట్లూరు..:** ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ప్రజా ఆశీర్వాద యాత్రలో యువ నాయకుడు రితీష్‌రెడ్డి, బ ద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న తెలిపారు. ఆదివారం కొండూరు ఎస్సీ, బీసీ కాలనీల్లో మన భవిష్యత్తు మారాలంటే టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పి.మల్లికార్జునరెడ్డి, మండల సీనియర్ నాయకులు నందగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పి.సుధారాణి, కొండూరు ఎంపీటీసీ లక్ష్మి, అమర్‌నాథరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మద్దిక పుల్లారెడ్డి, పి.చిన్నపరెడ్డి, ఎద్దుల నారాయణరెడ్డి, బూత్ కన్వీనర్లు గోపాల్, బుగ్గిరాజ, బత్తల వెంకటసుబ్బయ్య, పి.రాజగోపాల్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, ఎన్.మనోహర్‌రెడ్డి, ఆదూరి సుబ్బారెడ్డి, ఓబులపతి, లక్ష్మీనరసయ్య, రాజా, నరసింహులు, కొండయ్య, జేసీపీ సుబ్బారెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎర్రగుంట్ల..:** రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీదే ఘనవిజయమని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి తల్లి సరస్వతి, సతీమణి జ్యోతి ఆశాభావం వ్యక్తం చేశారు. మినీ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల ను వివరించారు. ఆదివారం సాయంత్రం ఎర్రగుంట్ల మండలంలోని టి.సుంకేసుల గ్రామంలో వారు బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని వస్తృతంగా నిర్వహించారు.మండల బాధ్యుడు ఎం.మోహన్‌రెడ్డి, ఈశ్వరయ్య, మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఓబులేసు, శ్రీనివాసులు,లోకేష్, చెన్నారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

**ప్రొద్దుటూరు..:** బాబు ష్యూరిటీతోనే రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గోపవరం పంచాయతీలోని శ్రీనివాసపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బాబుల్‌రెడ్డి, బండిభాస్కర్‌రెడ్డి, ఆవుల దస్తగిరి , తాటి శ్రీను, శూలం ప్రసాద్, పొట్టి పాటి గంగాధర్, క్రిష్ణారెడ్డి , మార్తల సుబ్బారెడ్డి, మార్తల ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఖాజీపేట..:** టీడీపీని ఆదరించాలని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ఆదివారం బస్టాండు కూడలి టీచర్స్ కాలనీ, మెయిన్‌బజార్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. అలాగే టీచర్స్ కాలనీలో కమలాపురం గౌస్ ఆధ్వర్యంలో గజమాల వేసి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజవర్గ ఇన్‌ఛార్జి మల్హోత్ర, టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, నాయకులు వెంకటసుబ్బయ్య, గోవిందు సుబ్బయ్య, వీరయ్య, హరినాథరెడ్డి, పిచ్చినాయుడు, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, మల్లికార్జునరెడ్డి, క్రిష్ణారెడ్డి, నాగశివారెడ్డి, కదిరుల్లా, జలీల్, జెండాల మాబాష, హబీబ్, కేకే బ్రదర్స్ హర్షద్, రమేష్‌నాయుడు, రామానాయుడు, శ్రీనివాసులు, రాము పాల్గొన్నారు.

**బద్వేలు టౌన్..:** ప్రజా ఆశీర్వాదయాత్రలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటి ప్రచారంలో భాగంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న, సమన్వయ కర్త రితీష్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాలనీల్లోప్రజా సమస్యలు తెలుసుకుంటూ ముందుకెళ్లారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, హసన్, వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జహంగీర్‌బాషా, బిగ్‌బాస్, కృష్ణారెడ్డి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



బద్వేలు, ఎర్రగుంట్లలో ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జఅరుణ, మాచుపల్లె లక్ష్మీదేవి, సరస్వతి, జ్యోతి, ప్రచారంలో భాగంగా ఖాజీపేటలో బజ్జీలు వేస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

## ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య కోసం దరఖాస్తులు

కొండాపురం, మార్చి 10: ప్రైవేటు పాఠశాలల్లో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవోలు ఓబులేసు,రామయ్య తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి ఈ నెల 25 వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సచివాలయాల్లో గాని,మీ సేవాలో గాని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.విద్యాహక్కు చట్టం క్రింద ప్రతి పాఠశాలలో 25 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని వారు తెలిపారు.

## 13న మెగా జాబ్ మేళా

బద్వేలు , మార్చి 10 : పట్టణంలోని వీరారెడ్డి కళాశాలలో 13 వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఛైర్మన్ విజయమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెచ్‌డి ఎఫ్‌సీ, ఐసీఐసీఐ, టెక్ మహీంద్రా, ముత్తూట్ ఫైనాన్స్ తదితర దాదాపు 40 కంపెనీల వారు పాల్గొననున్నట్లు తెలిపారు. 18 నుంచి35 సంవత్సరాల వారు ఆయా కంపెనీల అర్హతను బట్టి అర్హులన్నారు. 10, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఆపై చదివిన వారు అర్హులని తెలియజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9492856652, 9441013050,7893574673,9000660144 నంబర్లనుసంప్రదించాన్నారు.

## 'టీడీపీ, జనసేన పార్టీలకు ఆదరణ పెరుగుతోంది'

జమ్మలమడుగు, మార్చి 10: జమ్మలమడుగు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీలపై ఆదరణ పెరుగుతోందని జమ్మలమడుగు జనసేన కోఆర్డినేటర్లు నల్లంశెట్టి నాగార్జున, డేరంగుల జగదీష్ తెలిపారు. ఆదివారం జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లో వారు జనసేన కార్యకర్తలతో మాట్లాడి సమావేశం అయినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం

చాపాడు, మార్చి 10: మండలంలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన కతాల్‌గారి హర్షిత అనే బాలికకు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి ఆదివారం రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. హర్షితకు ఇంటి వద్ద గోడ కూలి మీదపడటంతో కాలు విరిగింది. ఆ గ్రామ సర్పంచ్ రహమతుల్లా ద్వారా బాలిక తల్లి రిహానాకు డబ్బులు అందజేశారు.

## ఘనంగా ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం

### ఆర్యవైశ్యులకు టీడీపీ అన్నివిధాలుగా అండగా ఉంటుంది : మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



బద్వేలు టౌన్, మార్చి 10 : ఆర్యవైశ్యులకు టీడీపీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న, టీడీపీ సమన్వయకర్త రితీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని నెల్లూరు రోడ్డు రాఘవేంద్ర కల్యాణమండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అలాగే నిరుపేద ఆర్యవైశ్యులకు ఇంటిస్థలాలు ఇప్పిస్తామన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీని ఆర్యవైశ్యులందరూ అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగువాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాకేశ్, మాజీ మార్కెట్‌యార్డు వైస్ ప్రెసిడెంటు, ఆర్యవైశ్య నాయకుడు కనుమర్లపూటి ప్రసాద్, సీనియర్ న్యాయవాది ఏపీ ఆర్య వైశ్య మహాసభ లీగల్ సెల్ ఛైర్మన్ పీవీఎస్ ప్రసాద్, వడ్లపూటి నాగభూషణం, బెస్తమల్ల సునీల్, నాగరాజు,కొండపల్లి సుబాష్, రమణ, రాధాక్రిష్ణ, వాసు, చెవుల క్రిష్ణమూర్తి, చిన్నిబసవయ్య, రాధాక్రిష్ణ, టీడీపీ నాయకులు పట్టణ అధ్యక్షలు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, సింగరయ్య తదితర టీడీపీ నాయకులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

## అసాంఘికాలకు అడ్డాగా ఐటీఐ కళాశాల ప్రాంగణం



ఐటీఐ కళాశాల ప్రధాన గేటు, ప్రాంగణం

జమ్మలమడుగు, మార్చి 10: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డులో ప్రధాన రోడ్డుకు పక్కన ఉన్న ఐటీఐ కళాశాల ప్రాంగణం అసాంఘికాలకు అడ్డాగా మారింది. ప్రధాన రోడ్డుపక్కన వెళ్లే వాహనదారులు, బయటి వ్యక్తులు, పట్టణంలోని వారు మరికొందరు సాయంత్రం చీకటి పడగానే ప్రాంగణంలో మద్యం ప్రియులు, మట్కా బీటర్లు తదితరులు చేరుతారు. నిత్యం గేటు తలుపులు వేయకుండా ఉంటారని పలువురు స్థానికుల తెలిపారు. ఆర్టీసీ బస్టాండు సమీపాన ఉన్న బ్రాందీషాపు వద్ద నుంచి నేరుగా ప్రొద్దుటూరు రోడ్డులోని ఖాళీ స్థలాలు, ఐటీఐ కళాశాల ప్రాంగణం మద్యం బాబులకు నిలయంగా మారిందని వాపోతున్నారు. కొందరు ఆ రోడ్డులో వాకింగ్ వెళ్లాలన్నా మద్యంబాబులతో ఇబ్బందిగా ఉందని పలువురు వాపోతున్నారు.

**● అపరిశుభ్రంగా కళాశాల ప్రాంగణం..:** ఐటీఐ కళాశాల ప్రాంగణం అపరిశుభ్రంగా మారింది. కంపచెట్లు, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల కంపచెట్లు తొలగించారు కానీ ఎండిన వాటిని తొలగించలేదు. కళాశాలలో సుమారు రూ.1.70 కోట్లతో ఐటీఐ కళాశాల భవనాలు పునర్నిర్మాణం జరుగుతోందని కళాశాల ప్రిన్సిపల్ నవరూప్‌కుమార్ తెలిపారు. కళాశాల ప్రాంగణంలో అసాంఘికాలు, మద్యంబాబులు ఆవరణలోకి ఎవరూ రాకుండా వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## అమృతనగర్‌లో తాగునీటికి కటకట

### వీధి కొళాయిల వద్ద పడిగాపులు ● బిందెలతో మహిళల నిరసనలు

ప్రొద్దుటూరు, మార్చి 10 : వేసవి మొదలైందంటే చాలు తాగునీటికి ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొనే పరిస్థితులు. గ్రామాల్లో ముఖ్యంగా రూరల్ వాటర్ వర్క్స్ (ఆర్‌డబ్ల్యూఎస్) వేసవి ముందస్తు చర్యలకు తగినంత ప్రణాళికలు వేసుకోలేదు. పంచాయతీ అధికారులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పంచాయతీ అధికారులు నిధుల లేమి సాకుతో చేతులు ఎత్తేస్తున్నారు. ముఖ్యం వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలు మరీ నిర్లక్ష్యం చేయబడ్డాయని ఆరోపణలు ఎదుర్కొంటుంది.

ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీలోని అమృతనగర్‌లో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ కాలనీల్లో ప్రతివేసవికి తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇక్కడ 5వేల గృహాలలో వేలాది మంది జీవిస్తున్నారు. ఈ కాలనీకి చెన్నమరాజుపల్లె పంచాయతీలోని నాగాయపల్లె చెరువులో ఇందిరమ్మ కాలనీ వారి నీటి సరఫరా కోసం తాగునీటి బోర్లు ఏర్పాటు చేశారు. అక్కడ ఆరు బోర్లు వుండగా ఈ వేసవి ప్రారంభంలోనే నాలుగు బోర్లలో నీటి మట్టం పడిపోయి ఎత్తిపోయాయి.దీంతో నీటి ఇక్కట్లు ప్రారంభం అయ్యాయి. అంతేకాకుండా చాలా వీధుల్లో పైపులైను లేవు. వాటిని పూర్తిస్థాయిలో ఇంకా ఏర్పాటు చేయలేదు. స్థోమత వున్నవాళ్ళు మోటార్లు వేసుకున్నవారికి మాత్రం కొంత నీరు అందే వెసులుబాటు వుంటున్నది, కానీ మెటార్లు లేని నిరుపేదల పరిస్థితి దయనీయంగా వుంది, వీధి కొళాయిల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వుంది. దీంతో మహిళలు గత పదిరోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయటి ప్రాంతాలకు రిక్షాలు, ఆటోలల్లోవెళ్ళి నీళ్ళు తీసుకువస్తున్నారు. దీంతో వ్యయభారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాల సిబ్బందికి చెప్పినా ప్రయోజనం లేకుండా వుందన్నారు. పంచాయతీ సిబ్బంది పైప్‌లైను పనులు జరుగుతున్నాయి. ప్రత్యామ్నాయంగా మోటార్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్నారు తప్ప తాత్కాలికంగా టాంకర్లు కూడా సరఫరా చేయడం లేదని వాపోతున్నారు. మరోవైపు ప్రతిరోజు ఎన్నికల ప్రచారం కోసం అధికార ప్రతిపక్ష పార్టీ నేతలు వస్తున్నా మా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. కాగా ఆదివారం అమృతనగర్‌కు ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే రాచమల్లుప్రసాద్‌రెడ్డిని రామాలయం వద్ద స్థానిక మహిళలు తాగునీటి సమస్యపై నిలదీశారు. దీంతో ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు.



పైపులైను వద్ద బిందెలతో పడిగాపులు గాస్తున్న మహిళలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

**యుద్ధ ప్రాతి పదికన నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

వేసవి ప్రారంభంలోనే నాగాయపల్లె చెరువులోని నాలుగు తాగునీటి బోర్లలో నీటి మట్టం పడిపోయింది.కేవలం రెండు బోర్లతో నీటి సరఫరా అన్నిప్రాంతాలకు సాధ్యం కావడంలేదు. రాముని దేవాలయం వద్ద కొత్త బోరు ఏర్పాటు చేస్తున్నాం.అక్కడ త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా ట్రాన్స్ ఫార్మర్ కోసం 11 లక్షల నిధులు వ్యయం చేశాం. రెండు రోజుల్లో నీటి సరఫరాను మెరుగు పరుస్తాం.తాత్కాలికంగా టాంకర్లతో సరఫరా చేస్తాం.

**కొనిరెడ్డిశివచంద్రారెడ్డి,సర్పంచ్,కొత్తపల్లె.**